తుఫాన్ బాధితులకు సాయం చేయండి

- నష్టం అంచనాలు పకడ్బందీగా ఉండాలి
- ఎక్కడా సమస్యల్లేకుండా చూడండి
- సముద్రకోత నివారణపై దృష్టి పెట్టాలి
- అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

కలెక్టరేట్ (కాకినాడ), పిఠాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి శుక్రవారం ఆయన కలెక్టర్, ఎస్పీ, డీఆర్వో, ఆర్డీవోలు, పాడా పీడీ, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, వ్యవసాయం, విద్యుత్ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ ప్రభావం వల్ల బాధితులకు నిత్యావసరాలు, నగదు అందించి ఆదుకోవాలని సూచించారు. పంటల నష్టం, ఆస్తి నష్టం అంచనాలు పకడ్బందీగా రూపొం దించాలన్నారు. ప్రభుత్వ సాయం అర్హు లకు అందేలా చూడాలన్నారు. పిఠాపురం నియోజకవర్గం తీరప్రాంత గ్రామాల్లో పారిశుధ్యం,తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. మత్స్యకార గ్రామాల్లో పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలన్నారు.నష్టపోయిన ప్రతి రైతుకి పరిహారం అందాలన్నారు.పంట నష్టం అంచనాలు రూపొందించే సమయంలో రైతుల పక్షాన నిలిచి పక్కాగా నివేదికలను రూపొందించాలన్నారు. తీరప్రాంతంలో తాత్కాలిక రాళ్ల గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటే సముద్రం కోతను నివారించ గలదన్నారు. తీర ప్రాంత రక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. కోతకు గురవుతున్న ఉప్పాడ, మూలపేట, కోనపాపపేట, అమీనాబాద్, సుబ్బంపేటలలో పరిస్థితులు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. పిఠాపురం కరివేపాకు పేటలో పల్లపు ప్రాంతంలో నీరు ఇంకా నిలిచి ఉందని దాన్ని తొలగించాలన్నారు. ఏలేరు కాలువ గొర్రె కండే గట్టు కొంత బలహీనంగా ఉన్నట్టు తెలిసిందన్నారు. యుద్ధప్రాతిపదికన గట్లను బలోపేతం చేయాలన్నారు. మల్లవరం ప్రాంతంలో పత్తి పంటకు నష్టం జరిగిందని వాటి అంచనాలు రూపొం దించాలని ఆదేశించారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావానికి 21 మండలాల్లో 68 గ్రామాలు, 7 పట్టణ ఆవాసాలు ప్రభావితం అయ్యా యన్నారు. 434 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 97 కేంద్రాలను తెరిచి 48,025 మందికి పునరావాసం కల్పించామన్నారు. జిల్లాలో 42 వేల మందికి నిత్యావసరాలు పంపిణీ చేశామన్నారు. 61 గృహాలు పాడయ్యాయనీ, 21 వేల హెక్టార్లలో పంటలకు నష్టం జరిగిందన్నారు. 668 హెక్టార్లలో హార్టికల్చర్ పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. 13 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు ధ్వంసం అయ్యాయన్నారు. పంచాయతీరాజ్ రోడ్లు 14 కిలోమీటర్ల మేరకు పాడయ్యాయని తెలిపారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి రూ.13 కోట్లు నష్టం జరిగిందని వెల్లడించారు. జిల్లాలో విద్యుత్‌శాఖకు సంబంధించి రూ.ఒక కోటి 67 లక్షలు నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. ఒక్క పిఠాపురంలోనే వరి, ఉద్యాన పంటలు 2,500 మంది నష్టపోయారని వివరించారు.



అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం పవన్



రక్తదానం చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ఒకరు చేసే రక్తదానం నలుగురికి ప్రాణదానం

రక్తదానం చేసిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఒకరు చేసే రక్తదానం ద్వారా ప్రాణాపాయంలో ఉన్న మరో నలుగురికి ప్రాణదానం చేసి పునర్జన్మ ప్రసాదించవచ్చని ఎస్పీ జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కాకినాడలోని పోలీసు కన్వెన్షన్ హాల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్పీతోపాటు కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్‌పాటిల్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ఆదిత్య కాలేజ్ విద్యార్థులు సుమారు వందమందికి పైగా రక్తదానం చేశారు. రక్త నిల్వలను ప్రాణాపాయంలో ఉన్న పేద ప్రజలకు వాడే విధంగా చర్యలు చేపడతామని ఎస్పీ అన్నారు. అమరులైన పోలీసులు, వారి సేవలను స్మరించుకోవడం ఆనందదాయకమన్నారు.



పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం

తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఎస్పీ నివాళి

కాకినాడ క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో యూనిటీ రన్ నిర్వహించారు. ముందుగా జిల్లా పోలీసు కార్యాలయంలో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉక్కు మనిషి పటేల్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడిస్తే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



ఏలేరు..ఏరులై!

ఉధృతంగా మారిన ఏలేరు వరద

- 10వేల క్యూసెక్కులపైనే విడుదల
- సామర్థ్యానికి మించి ప్రవాహం
- 4 మండలాల్లో పలు చోట్ల గండ్లు
- రాజుపాలెం వద్ద మళ్లీ గండి
- గొల్లప్రోలు టోల్‌గేట్ వద్దకు వరద
- 5,200 ఎకరాలు ముంపు

(కాకినాడ,పిఠాపురం,గొల్లప్రోలు-ఆంధ్రజ్యోతి) జిల్లాను ఏలేరు వణికిస్తోంది. ఒక పక్క తీవ్ర తుఫాన్ ముప్పు తప్పిందనుకుంటే మరోపక్క వరద ముప్పు భయపెడుతోంది. ఇప్పటికే ఉధృ తం దాల్చిన వరదతో ఎక్కడికక్కడ కాలువలు ఉప్పొంగుతున్నాయి. వరుసగా గండ్లు పడుతున్నాయి. గతేడాది పూడ్చిన గండ్లు సైతం లీకవుతూ పంటపొలాలను ముంచెత్తుతున్నాయి. వరద తీవ్రతపై డిప్యూటీ సీఎం పవన్ కలెక్టర్‌తో సమీక్షించారు. గట్లు పటిష్టం చేయాలని ఆదేశించారు.

మొంథా తుఫాన్ ముప్పు పొంచి ఉండడంతో ముందస్తుగా ఏలేరు రిజర్వాయరు నుంచి అధికారులు భారీగా నీటిని వదిలేశారు. తుఫాన్ అనంతరం కురిసే కుండపోత వానతో రిజర్వాయర్ నింపవచ్చని భావించారు. ఇదిలా ఉండగా గత నాలుగు రోజులుగా ఏలేరు రిజర్వాయర్‌కు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి భారీగా వరద వచ్చిపడుతోంది. శుక్రవారం అత్యధికంగా 38 వేల క్యూసెక్కుల వరకూ ఇన్‌ఫ్లో వచ్చింది.రిజర్వాయరు నిండిపోవడంతో కాలు వల్లోకి 8,675 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కానీ అనధికారికంగా 10 వేల క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేసేశారు. కాలువల్లో ఒక్కసారిగా నీటి ఉధృతి పెరిగింది.ఫలితంగా కిర్లం పూడి మండలం రాజుపాలెం వద్ద కాలువకు భారీ గండి పడింది. గతేడాది సరిగ్గా ఇక్కడే గండి పడడంతో అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. తాజా గండితో అధికారులు అప్రమత్తమయ్యారు. అతికష్టంపై గండిని పూడ్చి ముప్పు తప్పించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ గండి వద్దకు వచ్చి పరిశీలించారు. గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలోని జాతీయ రహదారిపైకి వరద నీరు వచ్చేసింది.వరద మరింత పెరిగితే హైవే ఒక వైపు పూర్తిగా వరదలో చిక్కుకుపోయే ప్రమాదం పొంచి ఉంది.అటు పిఠాపురం-గొల్లప్రోలు మధ్య, పిడింగొడ్డి, గొర్రిఖండి సమీపంలో ఐదు ప్రాంతాల్లో వరుసగా శుక్రవారం గండ్లు పడ్డాయి.గొల్లప్రోలు, సీతానగరం, లక్ష్మీపురం, బి.ప్రత్తిపాడు,బోగాపురం, రాపర్తి, రాయవరం, గోకివాడ, జములపల్లి, నరసింగపురం తదితర గ్రామాల్లో 4,500 ఎకరాల్లోని వరి తదితర పం టలు ముంపునకు గురయ్యాయి. కాలువలు, గట్లు, పొలాలు జలాశయాలను తలపిస్తున్నా యి. మరో పక్క పిఠాపురం, గొల్ల ప్రోలు మండలాల పరిధిలో అనేకచోట్ల లీకులు పెరిగాయి. పెద్దాపురం మండలం వడ్డ మూరు వద్ద ఏలేరు కాలువకు గండిపడి పంట పొలాలు మునిగిపోయాయి.రిజ ర్వాయరుకు ఇంకా వరద పోటెత్తుతుండడంతో ప్రమాదం మరింత పెరిగే పరిస్థితి ఉంది.

ఇన్‌ఫ్లో కలవరం

ఏలేరు రిజర్వాయర్‌కు వస్తున్న ఇన్‌ఫ్లోస్ కలవరపెడుతున్నాయి. గురువారం గరిష్ఠంగా ప్రాజెక్టుకు 38 వేల క్యూసెక్కుల నీరు పోటెత్తింది. అల్లూరి జిల్లాలో కురిసిన వర్షాలతో ఇన్‌ఫ్లో అధికంగానే ఉంది. శుక్రవారం ఉదయం 10 వేల క్యూసెక్కులకు పైగా ఉన్న ఇన్‌ఫ్లో ఒకానొక సమయంలో 3,300 క్యూసెక్కులకు తగ్గింది. హమ్మయ్య అని జలవనరుల శాఖ అధికారులు ఊపిరి పీల్చుకునేలోగా మళ్లీ 8 వేల క్యూసెక్కులకు చేరింది. ఇన్‌ఫ్లో తగ్గిందని అవుట్ ఫ్లోను 8,675 క్యూసెక్కులు నుంచి 6,175 క్యూసెక్కులకు తగ్గించారు. వరద పెరగ డంతో మళ్లీ పది వేల క్యూసెక్కులు వదిలేశారు. ఏలేరు కాలువ గట్లు 5,500 క్యూసెక్కుల వరద నీటిని మాత్రమే తట్టుకోగలవు. అంతకు రెట్టింపు వస్తుండ డంతో గండ్లు పడుతున్నాయి. శుక్రవారం రాత్రి వరకూ వరద ఉధృతి పెరుగుతూనే ఉంది. రిజర్వాయర్‌లో నీటిమట్టం 85.71 మీటర్లు ఉండగా, 22.38టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి.





రైతుల పహారా

నీట మునిగిన పంట

ఏలేరు వరద విడుదలతో పొలాలు ముంపునకు గురికాకుండా ఉండేందుకు రైతులు కాలువల గట్లు పైనే రాత్రంతా పహారా కాశారు. తెల్లవారుజాము నుంచే గట్లపై ఇసుకబస్తాలు వేసి పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు. గొల్లప్రోలు టోల్‌గేట్, పిడింగొడ్డి,ఎదురొడ్డి, పిప్పికాలువ, గొల్లప్రోలు కాలువ,గొర్రిఖండి తదితర ప్రాంతాలు, పిఠాపురం మండలం గోకివాడ,రాపర్తి ప్రాంతాల్లో కాలువ గట్లపై రైతులు వంతుల వారీగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకూ పహారా కాస్తూనే ఉన్నారు.



జ్యోతుల నవీన్, వర్మ పరిశీలన

ఈ పాపం వైసీపీదే..

ఏలేరు వరదల కారణంగా జరుగుతున్న నష్ట పాపం వైసీపీదేనని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీ ఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురం-గొల్లప్రోలు పట్టణాల మధ్య పిడింగొడ్డి, గొర్రిఖండి, టోల్‌గేట్ తదితర ప్రాంతాల్లో పడిన గండ్లను శుక్రవారం పరిశీలించారు.నాడు ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణ పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కాలువలకు పడిన గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ధవళేశ్వరం ఇరిగేషన్ ఎస్ఈ గోపినాథ్ అధికారులను ఆదేశించారు.

అవే శాపమా?

గతేడాది ఏలేరుకు భారీ వరద పోటెత్తి జల విలయం చోటుచేసుకుంది. పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట, ప్రత్తిపాడు మండలాల పరిధిలో ఏకంగా అప్పుడు 280కి పైగా ప్రాంతాల్లో గండ్లు పడ్డాయి. దీంతో ఆస్తి, పంట నష్టం రూ.130 కోట్లకు చేరింది.అప్పట్లో పడ్డ గండ్లకు ఇప్పటి వరకు సగం మాత్రమే పూడ్చి వదిలేశారు. మరో పక్క దాదాపు 300 ప్రాంతాల్లో ఏలేరు కాలువల గట్లు కోతకు గురైనా మరమ్మతులు చేపట్టలేదు. రైతులే ఇసుకబస్తాలతో తాత్కాలిక రక్షణ ఏర్పాట్లు చేసుకున్నారు. ఇవే ఇప్పుడు తాజా వరదకు రైతులకు శాపంగా మారాయి.



పిఠాపురం- గొల్లప్రోలు మధ్య కాలువ గట్టుకు కోత

పెన్షన్ రెడీ!

- జిల్లాలో రూ.2.72 లక్షల మందికి రూ.118.01 కోట్ల సొమ్ము పంపిణీ
- తొలిరోజే నూరు శాతం పంపిణీ పూర్తి చేయాలి : కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశం



(కాకినాడ - ఆంధ్రజ్యోతి) ప్రతి నెలా ఒకటో తేదీన అందజేసే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నవంబర్ మాసానికి సంబంధించి జిల్లాలో 2,71,628 మందికి రూ.118.01 కోట్లు పంపిణీ చేయనున్నారు. శనివారం ఉదయం ఏడు గంటల నుంచే సచివాలయ సిబ్బంది పింఛనుదారుల ఇంటికి వెళ్లి పింఛను సొమ్ము అందజేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పింఛన్ల పంపిణీ సకాలంలో పూర్తి చేసేలా అధికారులు, కిందిస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. తొలిరోజే నూరుశాతం పంపిణీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నవంబర్ నెల పింఛన్ల పంపిణీకి సంబంధించి శుక్రవారం కలెక్టర్ షాన్‌మోహన్ కలెక్టరేట్ నుంచి మండలస్థాయి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సామాజిక భద్రత కింద జిల్లాలో ఎన్టీఆర్ భరోసా కింద ఈనెలలో అవ్వ, తాతలకు, దివ్యాంగులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, ఇతర పింఛనుదారులకు ఈనెల ఒకటో తేదీన పింఛను అందజేయాలని ఆదేశించారు.

మండలాల వారీ పంపిణీ ఇలా..

మండలం	పింఛనుదారులు	పింఛను సొమ్ము
కాకినాడ అర్బన్	29,352	రూ.12.81 కోట్లు
కాకినాడ రూరల్	18219	రూ.7.86 కోట్లు
కరప మండలం	11278	రూ.4.89 కోట్లు
సామర్లకోట	11567	రూ.4.94 కోట్లు
సామర్లకోట అర్బన్	6246	రూ.2.73 కోట్లు
పెద్దాపురం	11556	రూ.4.95 కోట్లు
పెద్దాపురం అర్బన్	6031	రూ.2.62 కోట్లు
కాజులూరు	9887	రూ.4.26 కోట్లు
కిర్లంపూడి	11067	రూ.4.91 కోట్లు
గండేపల్లి	8374	రూ.3.68 కోట్లు
జగ్గంపేట	11969	రూ.5.30 కోట్లు
కోటనందూరు	7681	రూ.3.34 కోట్లు
కొత్తపల్లి	12,437	రూ.5.23 కోట్లు
గొల్లప్రోలు	7636	రూ.3.34 కోట్లు
గొల్లప్రోలు అర్బన్	2852	రూ.1.22 కోట్లు
పిఠాపురం	10982	రూ.4.67 కోట్లు
పిఠాపురం అర్బన్	5607	రూ.2.42 కోట్లు
ప్రత్తిపాడు	11473	రూ.5.03 కోట్లు
రౌతులపూడి	7912	రూ.3.44 కోట్లు
శంఖవరం	7524	రూ.3.25 కోట్లు
ఏలేశ్వరం	6631	రూ.2.94 కోట్లు
ఏలేశ్వరం అర్బన్	3681	రూ.1.61 కోట్లు
తొండంగి	12364	రూ.5.42 కోట్లు
తుని మండలం	12217	రూ.5.34 కోట్లు
తుని అర్బన్	5297	రూ.2.34 కోట్లు
తాళ్లరేవు	11417	రూ.4.93 కోట్లు
పెదపూడి	10371	రూ.4.43 కోట్లు



ధర్మవరంలో తుఫాన్‌కు దెబ్బతిన్న ప్రత్తిపంట

మొంథా విపత్తి!

- పత్తి పంటపై తుఫాన్ ఎఫెక్ట్
- నేలవాలిన పత్తిచేలు
- నష్టపోయామని రైతాంగం గగ్గోలు

ప్రత్తిపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దెబ్బకు జిల్లాలో పత్తి రైతు దారుణంగా చిత్తయ్యాడు. మొదటి విడతగా పత్తి పంట దిగుబడి చేతికందే సమయంలో విరుచుకుపడ్డ తుఫాన్ కారణంగా పత్తి రైతాంగం నిలువునా నష్టాల్లో మునిగిపోయారు. భారీ వర్షాలకు, ఈదురుగాలులకు పత్తి తడిచిపోవడం, మొక్కలు విరిగిపోవడం, పత్తి కాయలు నీటిలో నానిపోయి గింజలు మొలకెత్తడం వంటి పరిస్థితుల్లో పత్తి రైతులు నష్టపోయారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్తిపాడు, గొల్లప్రోలు, కిర్లంపూడి, శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు, తుని, తొండంగి తదితర మండలాల్లో ఏటా పత్తి పంట సాగుచేస్తున్నారు. ఈ మండలంలో దాదాపుగా 11 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తుండగా ప్రస్తుతం సంబంధించిన తుఫాన్ కారణంగా వాటిలో 4 వేల ఎకకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. ఒక పక్క క్వింటా పత్తికి ప్రభుత్వం రూ.8100 మద్దతు ధర ప్రకటించగా పింజెకు రూ.7700 మద్దతు ధర ప్రకటించింది. ధర బాగున్నా ప్రకృతి కరుణించలేదని రైతులు వాపోతున్నారు. తుఫాన్ కారణంగా ఈదురుగాలు వల్ల మొక్కలు విరిగిపోయాయి. ఎకరాకు రూ.40 వేలు నుంచి రూ.50 వేలు పెట్టుబడి పెట్టి నష్టపోయామని రైతులు వాపోతున్నారు. మొదటి విడతగా ఎకరాకు అరటన్ను పైబడి పత్తి దిగుబడి చేతికందే సమయంలో తుఫాన్ నీళ్లు చల్లిందని రైతులంటున్నారు. పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.జిల్లాలోని గొల్లప్రోలు, ప్రత్తిపాడు, తుని ప్రాంతాల్లో అధికంగా పత్తి పంటలకు నష్టం చేకూరిందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి తీవ్రంగా నష్టపోయిన పత్తి రైతులను, కౌలురైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తల దరఖాస్తులను మంజూరు చేయాలి

కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఏకగవాక్ష విధానం కింద ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులను త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 1259 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 1082 పరిశ్రమల అనుమతులు మంజూరు చేశామన్నారు. మిగిలిన 172 దరఖాస్తులు వివిధ శాఖల వద్ద పరిశీలనలో ఉన్నాయన్నారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాలలో 25 యూనిట్లకు సుమారుగా రూ.5కోట్ల 75లక్షల రాయితీల జారీకి కమిటీ ఆమోదించిందన్నారు. పరిశ్రమలశాఖ జీఎం సీహెచ్ గణపతి, ఏడీ విజయ్‌కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, రవాణాశాఖాధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చివరి... బాతులకు చేటి...

మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పాలు పోసుకుంటున్న దశలో వున్న వరి చేలు నిండా మునిగాయి. చేలల్లో వున్న వరి గింజలు ఎందుకూ పనికారావు. శాకాహారి అయిన బాతులు మాత్రమే వీటిని తింటాయి. శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలో రైతులు చేలల్లో వదిలేసిన ధాన్యం గింజలను బాతులు తింటుండగా 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది. ఆ చిత్రాలే ఇవి...

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం





భావ కవితల పాలవెల్లి
ఆంధ్రా షెల్లీ



- రావువారిచంద్రపాలెంలో పుట్టి విశ్వ విఖ్యాతి
- సాహితీ పూదోటలో పరిమళాలు
- చిత్రసీమలో మూడు దశాబ్దాలు హవా
- 'వసంత విలాసి' దేవులపల్లి కృష్ణశాస్త్రి 128వ జయంతి సందర్భంగా



ఆకాశవీధిలో హాయిగా ఎగిరే మేఘమాలికలను ప్రేమికుల నడుమ విరహ సందేశాలుగా పంపగల అభినవ కాళిదాసు ఆయన... మనసున మధుర భావనలను సరళ, లాలిత్యమైన అచ్చతెనుగు పదజాలంతో సామాన్యుని మనోవీధిలో ఎగిరించారు... పద్యానికైనా, పాటకైనా, మరే సాహిత్య రూపమైనా... రూప వ్యవస్థ కంటే భావోన్నతే ముఖ్యమని ప్రకటించి భావ కవి అయ్యారు.



ఆకులో ఆకునై కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై ఈ అడవి సాగిపోనా.. ఎటులైనా ఇచటనే ఆగిపోనా.... అంటూ తన భావ కవితా పటిమతో ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించిన కవి ఆయన. తన రచనలతో పేరు ప్రఖ్యాతలు గడించారు. సినీ సాహిత్యంలోనూ తనదైన ముద్ర వేసి మూడు దశాబ్దాల పాటు చిత్రసీమలో హవా కొనసాగించారు. ఆయన పాటలు కోయిల గానంలా హాయిగా సంధ్యా సమయంలో గోదావరి గాలిలా ఆహ్లాదకరంగా ఉంటాయి. అంతటి కమ్మని, నెమ్మని రచనలతో తనకంటూ ఓ శైలిని రూపొందించుకున్న ఆయన సదా సాహిత్య స్మరణీయుడు. ఆ భావ కవితా చక్రవర్తి దేవులపల్లి కృష్ణశాస్త్రి. నేడు ఆయన 128వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం...

(సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం రావువారిచంద్రంపాలెంలో 1897 నవంబరు 1న దేవులపల్లి తమ్మన్నశాస్త్రి-సీతమ్మలకు కృష్ణశాస్త్రి జన్మించారు. పువ్వు పుట్టగానే పరిమళించినట్టు ఆయనకు కవిత్వ వాసన అబ్బింది. తండ్రి, పెద తండ్రి స్ఫూర్తితో చిన్నతనం నుంచే సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు.

- రావువారిచంద్రంపాలెంలో ప్రాథమిక విద్య, పిఠాపురంలో ఉన్నత విద్య, 1918లో విజయనగరం డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు.
- కందుకూరి వీరేశలింగంపంతులు, రఘుపతి వెంకటరత్నంనాయుడు శిష్యరికంలో బ్రహ్మసమాజ ప్రభావ గీతాలు రచించారు. ఆంగ్ల, వంగ సాహిత్యాలపై దృష్టి కేంద్రీకరించారు. ఆ ప్రభావంతోనే కృష్ణపక్షం సంపుటి రాశారు. 1920 నుంచి 1935 వరకు ఆయన అందరిపైనా ప్రభావం చూపారు.
- 1922లో సతీ వియోగంతో 'కన్నీరు' అనే ఖండకావ్యం, ఊర్వశి రాశారు.
- 1929లో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌ను కలిశాక ఆ పరిమళం పైపైకి ఎగసి ప్రపంచమంతా పాకి 'ఆంధ్ర షెల్లీ' బిరుదు సంపాదించిపెట్టింది. రవీంద్రుని కవిత్వానికి ఆయన అద్దిన భావ తళుకులు ఎందరినో ఆకట్టుకున్నాయి.
- పెద్దాపురం లూథరన్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరిన కృష్ణశాస్త్రి సంస్కరణోద్యమం, బ్రహ్మసమాజం, నవ్య సాహితీ సభ్యులుగా భావ కవితోద్యమ ప్రచారకుడిగా దేశమంతా పర్యటించారు.
- స్త్రీ, హరిజనోద్ధరణ కార్యక్రమాలు చేపట్టారు. 1933-1941 మధ్య కాలంలో కాకినాడ పీఆర్ కళాశాలలో ఉపన్యాసకుడిగా పని చేశారు.
- 1942లో నిర్మాత బీఎన్ రెడ్డి ప్రోత్సాహంతో చిత్రసీమలో అడుగుపెట్టారు. 1951లో మల్లీశ్వరి చిత్రంలో ఆయన రాసిన ప్రతి పాట సినీ రంగంలో ప్రత్యేక స్థానం కల్పించాయి. 25 సినిమాల్లో 170 పాటలు రచించారు. ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు, మనసున మల్లెలు మాలలూగెనే... వంటి గీతాల పునాదులపై ఆయన చిత్ర జీవితం పాటలా సాగింది.
- దేవులపల్లి సుకుమార సుందర సుమధుర లలిత మనోహర భావాలతో మూడు దశాబ్దాల పాటు సినీ సామ్రాజ్యాన్ని ఏలారు.
- 1945లో ఆకాశవాణిలో చేరాక తెలుగు సాహిత్యమే ఆయనకు వ్యాపకమైంది. దేశభక్తి గీతాలు, గేయ మాలికలు, గేయ కృతులు, పద్య కవితలు, లలిత లాలిత్య గీతాలు, సంగీత రూపకాలు, పిల్లల పాటలు, తిరుప్పావై పాశురాలతో ప్రాచుర్యం గడించారు. హైదరాబాద్ ఆకాశవాణి నుంచి ప్రసారమైన ఇవి ప్రజాదరణ పొందాయి.
- గోదా కల్యాణం, ధనుర్దాసు, వేణుకుంజా, వసంతోత్సవం వంటి నాటకాలు ఎంతో ప్రసిద్ధి పొందాయి.
- దేవులపల్లి చివరి రోజుల్లో 'గోరింట పూచింది కొమ్మ లేకుండా పాట రచించారు. ఆయన రాసిన 'జయజయ ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి' గీతం జాతీయ గీతానికి అన్ని అర్హతలు ఉన్న గీతంగా గుర్తింపు పొందింది.
- కృష్ణశాస్త్రిని ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణతోను, కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్‌తోను సత్కరించాయి.
- 1966లో కంఠం మూగబోయినా రచనలు కొనసాగించారు. 1980 ఫిబ్రవరి 24న తుది శ్వాస విడిచారు.
- దేవులపల్లి కృష్ణశాస్త్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదివిన ఇద్దరు విద్యార్థులు మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. వారి సమక్షంలో దేవులపల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం కృష్ణశాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించనున్నారు.
- దేవులపల్లి మరణించి 45 ఏళ్లు కావస్తున్నా ప్రభుత్వం ఆయన్ను సరైన రీతిలో గుర్తించలేదు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు హయాంలోనైనా ప్రభుత్వం తరపున కృష్ణశాస్త్రికి, ఆయన స్వగ్రామమైన రావువారి చంద్రంపాలేనికి తగిన గుర్తింపు లభించగలదని ఆశిద్దాం.



తన జన్మ స్థలమైన రావువారి చంద్రంపాలెంలో అందరినీ విద్యావంతులు చేయాలన్న ప్రగాఢ కాంక్షతో తన సొంతింటిని పాఠశాల నిర్వహణకు ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చిన ధన్యజీవి. నేటికీ ఆయన ఇంటి ఆవరణలోనే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను నిర్వహిస్తుండడం గర్వకారణం. అక్కడే దేవులపల్లి అభిమానులు ఆయన నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయగా 2004లో అప్పటి కలెక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆవిష్కరించారు.

ఎంఎస్‌ఎంఈ యూనిట్ల మంజూరుకు కృషి

ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్ శ్రీనివాసరావు



శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రహమతుల్లా

సర్పవరం జంక్షన్, అక్టోబరు 31(ఆంధ్ర జ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఖాదీ గ్రామీణ బోర్డు ద్వారా ఎంఎస్ఎంఈ యూనిట్లు మంజూరు చేయించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కృషి చేస్తానని ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్ శిరంగు శ్రీనివాసరావు తెలిపారు.కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఏరియాలో గల ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు జిల్లా కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. శ్రీనివాసరావుకు అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్ రహమతుల్లా పుష్పగుచ్ఛమిచ్చి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు నిరుద్యోగ యువత కోసం అమల్లో ఉన్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ఎంఎస్ఎంఈ యూనిట్లు, సంప్రదాయ పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను ఏడీని అడిగి తెలుసుకున్నారు. తొలుత ఆయన ఎమ్మెల్యే నానాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటికాయల వీరబాబు, పాండ్రంకి రాజు, గేదెల చిన్నారావు, కుర్రా నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సప్త నదీ జలాభిషేక మహోత్సవం



ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభుడు

పిఠాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శుక్రవారం సప్త నదీ జలాభిషేకం వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు జరిగిన మహోత్సవాలు ముగిశాయి. ఉదయం శ్రీపాదశ్రీవల్లభుల దివ్య పాదుకలకు దత్త మూలమంత్ర సప్త నదీజలాభిషేకం, నీరాజన మంత్రపుష్పం,

ఘనంగా రామస్వామి జయంతి

సాయంత్రం లక్ష్మీగణపతి సహిత రుద్రహోమం, దత్త మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, చతుర్వేద స్వస్తి నిర్వహించారు. పీఠాధిపతి సజ్జనగడ రామస్వామి ఏకోత్తర శత జయంతి సందర్భంగా ఆయన పాదుకలకు పూజలు చేశారు. గోపూజ, అభిషేకాలు జరిగాయి. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శ్రీపాదశ్రీవల్లభులకు సప్తనదీజలాలతో అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఆధునిక ఎలక్ట్రిక్ షిప్పుల తయారీకి ఒప్పందం



ఒప్పంద పత్రం చూపుతున్న శాన్ మారిటైమ్ షిప్పింగ్ సంస్థ ఎండీ అహ్మద్ ఆలీషా

కాకినాడ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ స్థాయిలో ముంబై వేదికగా అక్టోబరు 27నుంచి 31వరకు జరిగిన ఇండియా మారిటైమ్ వీక్-2025 సదస్సులో పాల్గొన్న కాకినాడకు చెందిన శాన్ మారిటైమ్ షిప్పింగ్ సంస్థ జపాన్, నార్వే సాంకేతిక సహకారంతో ఆధునిక ఎలక్ట్రిక్ షిప్పుల తయారీకి భారత ప్రభుత్వంతో సాంకేతిక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ దేశాల షిప్పింగ్ దిగ్గజ సంస్థల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర పోర్టులు, నౌకాశ్రయాలు, షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, పలువురు కేంద్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు శాన్ మారిటైమ్ షిప్పింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్ ఆలీషాను అభినందించారు.

3న జాబ్‌మేళా

కాకినాడ సిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్ ఆవరణలో వికాస కార్యాలయంలో ఈ నెల 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్‌లో టీమ్ మేనేజర్, ఐఅండ్‌వీ బయో ఇండియా కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, ప్రొడక్షన్ యూనిట్, ఏజీ ఐ గ్రీన్ ప్యాక్ కంపెనీలో ప్యాకింగ్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ(ప్రొడక్షన్, మెకానికల్ మెయింటెనెన్స్) ఐసాన్ ఎక్స్‌పీరియన్స్‌లో టెలీ సేల్స్ రిప్రజెంటేటివ్, ఇసుజు మోటార్స్ కంపెనీలో టెక్నీషియన్, ఫాక్స్‌కాన్ కంపెనీలో మొబైల్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్, బీఈ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12,000-రూ.30,000 వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలకు బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టి ఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబరు 77993 762 22లో సంప్రదించాలని చెప్పారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన చిట్యాల విద్యార్థులు

గోపాలపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు తూర్పుగోదావరి జిల్లా చిట్యాల జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వైఎస్ఎన్ మూర్తి తెలిపారు.ఇటీవల కొవ్వూర్పులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14 జిల్లా స్థాయి పోటీల్లో 9వ తరగతి విద్యార్థి ధనుష్, 8వ తరగతి విద్యార్థి ఆర్యాఆనంద్ పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీను, సీఆర్‌సీ కొయ్య నాగరాజు అభినందించారు. కాగా, ఈనెలలో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారిద్దరూ పాల్గొంటారని చెప్పారు.

రాయవరం నుంచి..

రాయవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాయవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పోలిశెట్టి భార్గవ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం విప్పర్తి శాంతి సునీత శుక్రవారం తెలిపారు.భార్గవ్ ఇటీవల అనపర్తిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన పోలిశెట్టి భార్గవ్

శనివారం కొవ్వూరులో జరిగే పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, పీఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, పీడీలు చిక్కాల అజ్జిబాబు, కె.శ్రీనివాస్ అభినందించారు.

జి.దొంతమూరు నుంచి..

రంగంపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శనివారం కొవ్వూరులో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని జి.దొంతమూరు హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న దుప్పలపూడి కామేశ్వరి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు కేవీ రామారావు తెలిపారు. అనపర్తి హైస్కూల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాలికల పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన కామేశ్వరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని పీడీ ఈ.లక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఆత్మకమిటీ చైర్మన్ ఎలుగుబంటి సత్తిబాబు, జనసేన మండలాధ్యక్షుడు గిరజాల సత్తిబాబు, సర్పంచ్ గోలి రమణ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటకృష్ణ,కూటమి నాయకులు ఉపాధ్యాయులు అభినందించారు.

బాస్కెట్‌బాల్ మెన్ అండ్ ఉమెన్ ఎంపికలు



బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులతో వాసంశెట్టి సత్యం

ద్రాక్షారామ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ సెలెక్షన్స్ అండ్ ఛాంపియన్‌షిప్ బాస్కెట్‌బాల్ పోటీలను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గన్నమని చక్రవర్తి క్రీడాకారులు ఎదుర్కొనే పలు సమస్యలను సత్యం దృష్టికి తీసుకొచ్చారు. సాయంత్రం చీకటి వల్ల ఇబ్బందులున్నాయని, లైట్స్ కావాలని ఆయనను కోరారు. దీనిపై సత్యం స్పందించి లైటింగ్‌కు రూ.2 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోలీస్ అమర వీరులకు సెల్యూట్



పోలీసు అమరవీరుల వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి త్రీటౌన్ పోలీస్ స్టేషను నుంచి పుష్కర్‌ఘాట్ వరకూ పోలీసులు, ప్రజలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు అజరామరమని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. వారి సేవలను భరత జాతి ఎన్నటికీ మరువదన్నారు.

-రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి).

బోటు ఫెస్టివల్ పోటీల నిర్వహణకు చర్యలు

లొల్ల లాకులను పరిశీలించిన ఆర్డీవో శ్రీకర్



లొల్ల లాకులను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఆత్రేయపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాబోయే సంక్రాంతి మూడు రోజులు బోటు ఫెస్టివల్ పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు ఆర్డీవో శ్రీకర్ తెలిపారు. శుక్రవారం లొల్ల లాకులు, తాడిపూడి, ఉచ్చిలి ప్రధాన కాలువలను ఆయన పరిశీలించారు.గతేడాది బోటు ఫెస్టివల్ కంటే అదనంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎంతో ఆహ్లాదకరమైన ఈ ప్రాంతంలో కార్తీకమాసం పిక్నిక్‌లు నిర్వహించేందుకు అనువైన లాకుల ప్రాంతాన్ని తీర్చిదిద్దాలన్నారు. తహశీల్దారు రాజేశ్వరరావు, ఆర్ఐ భాను పాల్గొన్నారు.

హెరాల్డింగ్ పరేడ్‌లో ముక్కామల కళాకారులు

అంబాజీపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని కెవడియా ఏక్తా నగర్‌లో సంగీత నాటక అకాడమీ- భారత మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ ఆధ్వర్యంలో జరిగిన హెరాల్డింగ్ పరేడ్‌లో ముక్కామలకు చెందిన కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో దేశవ్యాప్తంగా దాదాపు 120మంది కళాకారులు పాల్గొనగా ఏపీ నుంచి ఇద్దరు కళాకారులు ఉండగా విజయదుర్గ గరగల బృందం తరఫున పసుపులేటి కుమార్(డోలు)ను పంపించామని ట్రూప్ లీడర్ పసుపులేటి నాగబాబు తెలిపారు. ప్రధాని మోదీ ఎదుట ఈ ప్రదర్శన ఇవ్వడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. తొలుత సంగీత నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ సంధ్య, కొరియోగ్రాఫర్ లోకేశ్ ఆనంద్ నేతృత్వంలో పది రోజులు రిహార్సల్స్ జరిగాయన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న కళాకారుడు కుమార్

గిరిప్రదక్షిణ విజయవంతం చేయాలి

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

పరిశీలించిన అన్నవరం దేవస్థానం ఈవో, చైర్మన్



గిరిప్రదక్షిణ రోడ్డులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో, చైర్మన్, అధికారులు

అన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కోరినకోర్కెలు తీర్చే భక్తవరదాయుడు అన్నవరం సత్యదేవుడికి ఈనెల 5న కార్తీక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని గిరిప్రదక్షిణ కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా జరగనుంది. సుమారు 2లక్షల మంది భక్తులు కాళ్లకు చెప్పులు లేకుండా సుమారు 11.5 కిలోమీటర్ల మేర రత్నసత్యగిరిలు చుట్టూ ఉదయం పల్లకీతో, మధ్యాహ్నం సత్యరథంతో తిరుగుతారు. వారికి అసౌకర్యం కలగకుండా చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పరిశీలించారు. ఈ దారిలో వైద్యశిబిరాలు, భక్తులకు పంచిపెట్టేందుకు పళ్లు, మజ్జిగ వితరణ బిస్కట్లు పంపిణీ స్టాల్స్‌ను పరిశీలించారు. రోడ్డుపై ఎటు వంటి రాళ్లు లేకుండా రోలింగ్ చేయించాలని చైర్మన్ సూచించారు. భక్తులు మధ్యాహ్నం రెండు గంటలకు తొలిపావంచా వద్దకు చేరుకుని సత్యరథం వెంట గిరిప్రదక్షిణ చేసేలా విస్తృత ప్రచారం గావించాలని పీఆర్వో విభాగ అధికారులను ఆదేశించారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా స మన్వయంతో గిరిప్రదక్షిణను విజయవంతం చే యాలని కోరారు. వారివెంట ఇంజనీరింగ్, పీఆర్వో విభాగ అధికారులతో పాటుగా ఏఈ వోలు, సూపరెంటెండెంట్‌లు పాల్గొన్నారు.

నిండుకుండలా...

ఏలేరు జలాశయం

దిగువకు 6వేల క్యూసెక్కుల నీరు విడుదల



ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు

ఏలేశ్వరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీస్థాయిలో వరద నీరు వచ్చి చేరడంతో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా జలాశయం నుంచి 6వేల క్యూసెక్కుల నీటిని శుక్రవారం విడుదల చేశారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులో నీటి నిల్వలు పెతున్నాయి. తుఫాను కారణంగా ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. దీంతో ఎగువ ప్రాతంలో కురిసే భారీ వర్షాలతో ప్రాజెక్టులో వరద నీరు చేరడంతో కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం మండలాలకు ప్రమాదం పొంచి ఉందని అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులో 6175 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ప్రాజెక్టులో మరో రెండు టీఎంసీలు నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. దీంతో ప్రాజెక్టులో శుక్రవారం నాటికి 86.56 మీటర్లకుగాను 85.71 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 22.38 టీఎంసీలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 175 క్యూసెక్కుల నీటిని, దిగువ ప్రాంతాలకు 6వేల క్యూసెక్కులనీటిని అధికారులు విడుదల చేశారు.

హైవేపైకి ఏలేరు వరద నీరు



గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో హైవేపైకి చేరిన ఏలేరు వరద నీరు

గొల్లప్రోలు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో 216వ జాతీయ రహదారిపైకి శుక్రవారం మధ్యాహ్నం ఏలేరు వరద నీరు చేరింది. ఏలేరు కాలువలకు గండ్లు పడడంతో పొలాల మీదుగా వచ్చి న వరద నీరు రోడ్డుపై నిలిచిపోయింది. రైతులు గట్టుపై ఇసుకబస్తాలు వేసి నీరు రాకుండా కట్ట డి చేయడంతో రహదారిపై నీరు సాయంత్రం నుంచి పెరగలేదు. లేకుంటే జాతీయ రహదారిపై ఒకవైపు వరద నీరు ప్రవహించేదని అధికారులు తెలిపారు.



పంపా రిజర్వాయర్‌లో ట్రయిల్‌రన్ నిర్వహిస్తున్న అధికారులు

తెప్పోత్సవానికి జాగ్రత్తలు తీసుకోవాలి

పంటుకు రెండోసారి ట్రయిల్‌రన్ విజయవంతం

అన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈఏడాది సత్యదేవుడి తెప్పోత్సవం నిర్వహణలో జాగ్రత్తలు మరింతగా తీసుకోవాలని చైర్మన్ రోహిత్ సూచించారు. ఈనెల 2న రాత్రి 7గంటలకు పంపా సరోవరంలో నౌకావిహారం జరగనున్న నేపథ్యంలో శుక్రవారం రెండోపర్యాయం అన్నిశాఖల అధికారులు, ఈవో, చైర్మన్ హంసవాహనంగా రూపుదిద్దుకోనున్న పంటుకు ట్రయిల్ రన్ నిర్వహించారు. పంపా రిజర్వాయర్‌లో ఈసారి నీటిమట్టం అధికంగా ఉన్నందున అనుమతించిన వైదిక సిబ్బందిని మాత్రమే పంటుపైకి ఎక్కించాలని, ఈ విషయంలో సిఫార్సులకు తలొగ్గవద్దన్నారు. లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేవిధంగా కోఆర్డినేట్ చేసుకోవాలని చైర్మన్ సూచించారు. నిర్దేశించిన సమయానికి వైదిక కార్యక్రమాలు, నౌకావిహారం జరగాలన్నారు. అనంతరం ప్రసాద వితరణలో క్యూలైన్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని సూచించారు.

సత్యదేవుడి సన్నిధిలో గరికపాటి పూజలు



వేదాశీర్వచనాలు పొందుతున్న గరికపాటి నరసింహారావు కుటుంబం

అన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. బంధువుల వివాహానికి హాజరైన వారు కొండదిగువన వివాహం అనంతరం స్వామివారి సన్నిదికి విచ్చేశారు.

ఘనంగా చండీహోమం

రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీసప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

'ఎంఎస్ఎన్' ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం



ధర్మకర్తల మండలిని సత్కరించిన దృశ్యం

కాకినాడ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురంలో మల్లాడి సత్యలింగం నాయకర్ చారిటీస్ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవాన్ని సహాయ కమిషనరు, కార్య నిర్వహణాధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్త మల్లాడి కార్తీక్ నాయకర్ చైర్మన్‌గా వ్యవహరించారు. ధర్మకర్తలుగా నులుకుర్తి శ్రీసత్యసాయి, మూగు చిన్ని, పిల్లారిశెట్టి దుర్గాప్రసాద్, రాళ్లపూడి ప్రకాష్, పీర్ల లక్ష్మీప్రసన్న, అరదాడి భవాని, ఓలేటి దుర్గ, మండపాక త్రిలోచన, ధూళిపాల సూర్యభగవాన్‌తో సహాయ కమిషనరు, ఈవో బళ్ల నీలకంఠం ప్రమాణం చేయించారు. ఎలిమెంటరీ స్కూలు, హైస్కూలు, ప్రధానోపాధ్యాయులు, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై అసత్య ప్రచారం..

భరత్‌రామ్‌పై చర్యలు తీసుకోండి

రాజమహేంద్రవరంలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ లీగల్ సెల్ ఫిర్యాదు



త్రీటౌన్ సీఐకు ఫిర్యాదు అందిస్తున్న టీడీపీ లీగల్ సెల్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై నిరాధారమైనఆరోపణలు చేస్తున్న వైసీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎంపీ భరత్‌రామ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ లీగల్‌సెల్ కమిటీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం ఉదయం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు టీడీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు, లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్ చేరుకుని సీఐ అప్పారావుకు ఫిర్యాదు అందించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసు వ్యక్తిగత, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా భరత్‌రామ్ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో అసత్యప్రచారం చేస్తున్నారని వివరించారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విగ్గు పెట్టుకుని స్టైల్‌గా కళ్లజోడు పెట్టుకుని మద్యం తాగి అసెంబ్లీ సమావేశంలో పాల్గొన్నారంటూ అభాండాలు వేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ జగన్ పెగ్గు పోశారని ఒప్పుకుంటే బాలయ్యబాబు మద్యం తాగారని తాము ఒప్పుకుంటామని సమాధానమిచ్చారని, అయితే జగన్ పోసాడా అనే మాటలను కట్ చేసి తాగి వచ్చారు అనే మాటలతో సోషల్ మీడియాలో ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కూడా భరత్‌రామ్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నగర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి మామిడి శ్రీను, బూరా రమణ, ఉడమల నాగేశ్వరరావు, చెన్నా వెంకటరమణ, కారంగీ వీర్రాజు, బత్తిన రవికుమార్, కొమరం సురేష్, దుత్తరపు గంగాధర్, కానేటి ప్రభుదాస్, బాబ్జి పాల్గొన్నారు.

పరిపాలనాధికారులకు ఎంపీడీవోలుగా పదోన్నతి

కాకినాడ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారులుగా పనిచేస్తున్న ఇద్దరికి ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. వారికి మండలాలు కేటాయించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం ఎంపీడీవోగా జేఎల్ఎన్ దీక్షితులు, కాకినాడ జిల్లా కరప ఎంపీడీవోగా జె.శ్రీనివాస్ నియమితులయ్యారు. కార్యక్రమంలో జడ్పీ ఇన్‌చార్జి సీఈవో జీఎస్ రామ్‌గోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

నా భర్తను కిరాతకంగా చంపారు..

న్యాయం చేయండి

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి మృతుడి భార్య వేడుకోలు



కొంకాపల్లిలో విలపిస్తూ తన గోడును వివరిస్తున్న కంచిపల్లి శ్రీదేవి

అమలాపురం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): "నా భర్తను అతి కిరాతకంగా చంపి నదీ పాయలో పడేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలి. ఇద్దరు బిడ్డలతో ఉన్న నా కుటుంబానికి న్యాయం చేయాలి" కంచిపల్లి దేవి వేడుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సోషల్ మీడియా వేదికగా శుక్రవారం తన గోడును వెల్లబోసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు శివారు కొంకాపల్లికి చెందిన నా భర్త కంచిపల్లి శ్రీనివాస్ (37) అక్టోబరు 25న ఇంటి నుంచి వెళ్లి 29న పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలోని గోదావరి నదీపాయలో శవంగా కనిపించాడని ఆవేదన వ్యక్తం చేసింది. పోలీసులకు 27నే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వివరించింది. గంగుమళ్ల కాసుబాబు, అడబాల శంకర్‌ల బృందం తన భర్తను అతి కిరాతకంగా చంపేశారని ఆరోపించింది. తన కుటుంబానికి మీరే న్యాయం చేయాలని వేడుకుంటూ సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేసింది. ఇలా ఉండగా హత్య అనంతరం అదృశ్యమైన కాసుబాబుతో సహా ఐదుగురు వినియోగించిన సెల్‌ఫోన్ల కాల్స్ ఆధారంగా కేసును చేధించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే ప్రధాన నిందితులు వినియోగించిన ఫోన్ కాల్ డేటా ఆధారంగా హత్యకు ముందు ఎవరెవరితో మాట్లాడారు, హత్యకు ఎవరు సహకరించారు అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన ఏరియా ఆసుపత్రి నుంచి శుక్రవారం నివేదిక వస్తుందని పోలీసులు భావించారు. కేసును చేధించేందుకు ప్రత్యేక బృందాలు గాలింపును ముమ్మరం చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇలా ఉండగా శ్రీనివాస్ ఇంటి వద్ద చిన్న కార్యక్రమం నిర్వహిస్తుండడంతో ఏదైనా ఆందోళన జరగవచ్చన్న సమాచారంతో డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు అప్రమత్తమయ్యారు. ఏ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టారు.

పంచాయతీ స్థలంలో అక్రమంగా షెడ్డు

రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో తొలగింపు



వల్లూరులో షెడ్డును తొలగిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామంలోని పంచాయతీ స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మాణం జరిగిందంటూ గ్రామకార్యదర్శి సత్తిబాబు, తహశీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీడీవో హెచ్.భానూజీరావు కు ఫిర్యాదు అందింది. దీనిపై శుక్రవారం రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో షెడ్డు తొలగించారు. కార్యదర్శి సత్తిబాబు తెలిపిన వివరాల ప్రకారం... వల్లూరు గ్రామపంచాయతీ పరిధిలో నిడసన మెట్టకు వెళ్లే రహదారి పక్కనే ఉన్న సర్వే నెం.205బై6లో 9 సెంట్లు పంచాయతీ స్థలం ఉంది. ఆ స్థలంలో గతంలో దళిత సామాజిక వర్గీయులు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆ విగ్రహానికి చేర్చి గత నెల 20న మళ్లీ నూతనంగా షెడ్డు నిర్మాణం చేశారు. ఆ స్థలం ప్రజలకు అవసరార్థం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి పంచాయతీ కేటాయించింది. పంచాయతీ అనుమతులు లేకుండా ఆ స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మాణం జరిగినట్టు తన దృష్టికి రావడంతో వెంటనే తహశీల్దార్, ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. దీనిపై తహశీల్దార్ సదరు ఆక్రమణ తొలగింపునకు పోలీస్ రక్షణ కావాలంటూ అంగర ఎస్ఐ హరీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండపేట రూరల్ సీఐ దొరరాజు ఆధ్వర్యంలో అంగర ఎస్ఐ జి.హరీష్‌కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేయగా పంచాయతీ అధికారులు అక్రమంగా నిర్మించిన షెడ్డను తొలగించారు. సీఐ దొరరాజు మాట్లాడుతూ ఎవరైనా అక్రమ చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయవరం, ద్రాక్షారామం ఎస్ఐలు, మండపేట ట్రైనీ ఎస్ఐలు సురేష్‌బాబు, లక్ష్మణబాబు, సోమేంద్ర, ఆర్ఐ అర్జమ్మ తదితర సిబ్బంది ఉన్నారు.

పేకాడుతున్న 17 మంది అరెస్ట్

అమలాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలోని భూపయ్య అగ్రహారం, వడ్లమానివారి వీధిలో గల ఒక అపార్టుమెంటులో పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారు. పోలీసులు గురువారం రాత్రి దాడి చేశారు. పేకాడుతున్న రాజకీయ పార్టీకి చెందిన కీలక నాయకులతో సహ సుమారు 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30,140 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అయితే అమలాపురం పట్టణ పరిసరాల్లో పేకాట క్లబ్‌లు నిర్వహిస్తున్నారనే సమాచారాన్ని సోషల్ మీడియాలో మహిళా నేత బొజ్జా ఐశ్వర్య ఇటీవల ఒక వీడియో విడుదల చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీకి అందిన సమాచారంతో గురువారం రాత్రి దాడిచేసి 17మందిని అదుపులోకి తీసుకున్నారు.

తప్పిపోయిన రేపాక ఆశ్రమ పాఠశాల విద్యార్థి

కూనవరం వద్ద పోలీసులకు క్షేమంగా దొరికిన బాలుడు



పోలీసుల వద్ద క్షేమంగా ఉన్న విద్యార్థి తేజ

కూనవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండలం రేపాక ఆశ్రమ పాఠశాల విద్యార్థి గుజ్జ స్వాత్విక్ తేజ గురువారం పాఠశాల నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న తేజ వెళ్లిపోయినట్టు గుర్తించిన సిబ్బంది ఈ మేరకు కూనవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ లతాశ్రీ శుక్రవారం సోషల్ మీడియా ద్వారా బాలుడు తప్పిపోయినట్టు ప్రచారం చేశారు. శుక్రవారం రాత్రి 7 గంటల స మయంలో విద్యార్థి తేజ కూనవరం సెంటర్‌లో కనిపించడంతో గ్రామస్తులు ఎస్ఐకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ బాలుడిని గుర్తిం చి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం బాలుడు పోలీసుల దగ్గర క్షేమంగా ఉన్నాడు. అయితే హెచ్ఎం, వార్డెన్ నిర్ల క్ష్యం కారణంగానే విద్యార్థి బయటకు వెళ్లిపోయినట్లు విమర్శలు వస్తున్నాయి. దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అదృశ్యమైన బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

కొవ్వూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన మైనర్ బాలికలను 24 గంటల్లో వెతికి కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లిలో నివసిస్తున్న మైనర్ బాలికలైన అవల కీర్తి, అవల నవ్య అక్టోబరు 30న ఉదయం 10 గంటలకు పూసలు అమ్ముకోవడానికి అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి ఆటోలో బయటకు వచ్చారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికలు ఎక్కిన ఆటోడ్రైవర్‌ను విచారించగా బాలికలు ఆటోడ్రైవర్ ఫోన్ నుంచి గతంలో వాడపల్లిలో తమ ఇంటిపక్కనే నివాసం ఉన్నవారికి జంగారెడ్డిగూడెం ఫోన్ చేశారని తెలిపాడు. పోలీసులు జంగారెడ్డిగూడెం వెళ్లి బాలికలను తీసుకొచ్చి తహశీల్దార్ స్టేట్‌మెంటు తీసుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. తల్లి మందలించడంతో బాలికలు జంగారెడ్డిగూడెం వెళ్లినట్టు పేర్కొన్నారు.


యానాం నుంచి బీర్లు రవాణా ఇద్దరిపై కేసు

కొవ్వూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యానాంలో 24 టిన్ బీర్లను కొనుగోలు చేసి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ట్రైనీ ఎస్ఐ బెల్లంకొండ జయరాజు తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణానికి చెందిన దాసరి పృథ్వీ వెంకటసాయి నితీష్, గడుసుకోట భానుప్రకాష్ అక్టోబరు 29న యానాంలో 24 టిన్ బడ్వయిజర్ బీర్లను కొనుగోలు చేసి కారులో నిడదవోలు తీసుకువస్తుండగా మద్దూరులంక బ్యారేజ్‌పై మోటారుసైకిల్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో గ్యాస్ ఏజన్సీ ఆటోడ్రైవర్ చాగల్లు మండలం దారవరానికి చెందిన షేక్ ఖాదర్ కాజా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం కారును మోటారు వెహికల్ ఇన్స్‌స్పెక్టర్ తనిఖీ చేస్తుండగా కారు డిక్కీలో 24 బడ్వయిజర్ బీర్లు కనిపించాయి. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని నితీష్, భానుప్రకాష్‌పై కేసు నమోదు చేశారు.

సారాతో ముగ్గురి అరెస్ట్

శంఖవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం మండపం సెంటర్‌లో హైవేపై గురువారం రాత్రి ఆటోలో తరలిస్తున్న 72 లీటర్ల సారాను తరలిస్తున్న ముగ్గురు నిందితులను అన్నవరం పోలీసులు అరెస్ట్ చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. నిందితులను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్టు పేర్కొన్నారు.

ఏపీఆర్డీసీ డైరెక్టర్‌గా వెన్న శివ నియామకం



వెన్న శివ

ప్రత్తిపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కత్తిపూడి గ్రామా నికి చెందిన టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్న ఈశ్వరుడు (శివ)ను ఆంధ్రప్రదేశ్ రోడ్ల డెవలపెమెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ)డైరెక్టర్ నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 16అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 16 మందిని ఏపీఆర్డీసీ డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. తనకీ ఉన్నత పదవి అవకాశం కల్పించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభకు శివ ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, పర్వత సురేష్, ఏళ్ళ జగదీష్, బద్ది రామారావు, సాధానాల లచ్చింబాబు అభినందనలు తెలిపారు.

ఏపీఆర్డీసీ సభ్యుడిగా ముదునూరి వేణుగోపాలకృష్ణ

అమలాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రోడ్ల డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్డీసీ) సభ్యుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ముదునూరి వేణుగోపాలకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఆర్డీసీ సభ్యుడిగా రెండేళ్ల పాటు పద విలో వేణుగోపాలకృష్ణరాజు కొనసాగనున్నారు.

పత్తి పంటల పరిశీలన



ధర్మవరంలో పత్తి పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రత్తిపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో దెబ్బతిన్న పత్తి పంటలను శుక్రవారం ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఎం.రాంభద్ర రాజు, ఐ.సుధీర్, వ్యవసాయ సహాయ సంచాలకులు జి.శ్రీనివాస్. పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి జోకా అమృత, పెద్దాపురం ఏరువాక కేంద్రం అధికారులతో కలిసి శాస్త్రవేత్తలు దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి పంటపై ఆశించిన కాయకుళ్లు తెగులు నివారణకు పాటిచాల్సిన విషయాలు వివరించారు. ధర్మవరం రైతు సేవా కేంద్ర సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

రెడ్‌క్రాస్ క్యాన్సర్ బ్లాక్ నిర్మాణానికి రూ.10లక్షల విరాళం

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ ఐటీఐ వెనుక శరవేగంతో నిర్మితమవుతున్న రెడ్‌క్రాస్ క్యాన్సర్ బ్లాక్‌కు రెడ్‌క్రాస్ రాష్ట్ర, కాకినాడ జిల్లా చైర్మన్ వైడీ రామారావు కుటుంబీకులు రూ.10 లక్షలు విరాళం ప్రకటించారు. వైడీఆర్ సప్తతి జన్మదినోత్సవం సందర్భంగా డిసెంబరు 16న రూ.10లక్షల చెక్కును కలెక్టరుకు అందజేస్తామని ఆయన కుటుంబీకులు చెప్పారు.



కాకినాడ జేఎన్టీయూ సెనేట్ హాలులో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్, మాజీ ఉప కులపతి ప్రసాదరాజు



పెద్దాపురం నవోదయలో ఐక్యతా ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, విద్యార్థులు


పిఠాపురంలో ఐక్యతా దినోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

దేశ ఏకత్వానికి ప్రతీక వల్లభాయ్ పటేల్

ఉక్కు మనిషికి నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

జిల్లాలో ఘనంగా ఐక్యతా దినోత్సవం... పలుచోట్ల ఐక్యతా ర్యాలీలు

జేఎన్టీయూకే, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశ ఏకత్వానికి ప్రతీక అని జేఎన్టీయూకే ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. పటేల్ 150వ జయంతి సందర్భంగా వర్సిటీ సెనేట్ హాలులో ఆయన చిత్రపటానికి వీసీ ప్రసాద్, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐక్యత, సమగ్రత, సేవాభావం అనే విలువలను విద్యా సంస్థల్లో పెంపొందించాలని వీసీ సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త శ్యామ్‌కుమార్, డైరెక్టర్ కృష్ణమోహన్, పీడీ వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు కిరణ్మయి, రమణాజీ, వీరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ): దేశ తొలి హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో రన్ ఫర్ యునిటీ పేరుతో 5కే రన్ నిర్వహించారు. బాలాజీచెరువు సెంటరు వద్ద ప్రారంభమైన రన్‌లో విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు 500 మందికి పైగా పాల్గొన్నారు. జాతీయ ఐక్యత ప్రతిజ్ఞతో ప్రారంభమైన కార్యక్రమంలో బీజేపీ నేతలు సాలగ్రామ లక్ష్మీప్రసన్న, యార్లగడ్డ రామ్‌కుమార్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయలో ప్రిన్సిపాల్ సీతలక్ష్మి ఆధ్వర్యంలో ఏక్తా దివస్ నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ వి.కేశవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డి.కాశీవిశ్వనాథం, శోభన్‌బాబు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): భారతదేశం ఐక్యంగా ముందుకు సాగడంలో వల్లభాయ్ పటేల్ పాత్ర ఎంతో కీలకమని అక్నూ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం.శ్రీదేవి, డాక్టర్ కె.హరిబాబు ఆధ్వర్యంలో ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఐక్యతా దివస్ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడాది పొడవునా ట్యాంకర్లతో నీటి సరఫరా!

ఆ ఖర్చుతో బోరు ఏర్పాటు చేయవచ్చు కదా

గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశంలో అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

గొల్లప్రోలు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏడాది పొడవునా ట్యాంకర్ల ద్వారా ఒక ప్రాంతానికి తాగునీరు సరఫరా చేసే ఖర్చుతో ఆ ప్రాంతంలో బోర్లు ఏర్పాటు చేయవచ్చని, ఈ విషయంలో ఇంజనీరింగ్ అధికారుల తీరు సరిగా లేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షత వహించారు. అధికారులు ముందుచూపుతో వ్యవహరించకపోవడంతో నిధులు వృథా అవుతున్నాయని టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు గుళ్ల సుబ్బారావు, మొగలి దొరబాబు, మైనం భవానీ రాణి తెలిపారు. 2017లో ఇంకుడు గుంతల నిర్మాణానికి ఇప్పుడు బిల్లులు పెట్టడం ఏమిటని గుళ్ల సుబ్బారావు అధికారులను ప్రశ్నించారు. అసలు ఇంకుడు గుంతలు ఎక్కడున్నాయో చెప్పాలని అధికారులను నిలదీశారు. పనులు చేయని కాంట్రాక్టర్లకే మరలా పనులు ఎందుకు కేటాయిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో ప్రారంభిస్తామని కమిషనరు ఆలీషా తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటిస్తున్న చైర్‌పర్సన్ అరుణ

ముచ్చటగా ముగ్గురు!

24 మంది కౌన్సిలర్ల గైర్హాజరు... కోరం లేక సామర్లకోట కౌన్సిల్ సమావేశం వాయిదా

సామర్లకోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ జి.అరుణ ప్రకటించారు. 33 అంశాలతో 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని సభ్యులందరకూ ముందుగా అజెండా అందజేసినప్పటికీ 24 మంది కౌన్సిలర్లు హాజరు కాలేదు. పది నిమిషాలు ఎదెరు చూసినప్పటికీ బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, పిల్లాడి సత్యవతి మాత్రమే హాజరయ్యారు. కోరం లేనందున సమావేశాన్ని వాయిదా వేస్తునట్టు చైర్‌పర్సన్ అరుణ ప్రకటించారు. దీంతో కమిషనరు శ్రీవిద్య, అధికారులు కౌన్సిల్ హాలు బయటికి వెళ్లిపోయారు.

సామర్లకోటలో అభివృద్ధి పనుల జోరు

సామర్లకోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): 'పట్టణంలో రూ.10కోట్ల వ్యయంతో చేపడుతున్న పనులు వివిధ దశల్లో ఉన్నాయి... టెండర్లు పూర్తికావాల్సిన పనులకు కౌన్సిల్ ఆమోదం లభించాల్సి ఉంది' అని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం సమీపాన కాపు కల్యాణ మండపం ఆధునికీరణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కమిషనరు శ్రీవిద్య, మున్సిపల్ డీఈలకు పలు మార్పులను సూచించారు. కల్యాణ మండపం నెలలో రూపు దిద్దుకొంటుందని, నిర్వహణకు ఒక కమిటీని నియమించుకుని స్వల్ప రుసుముతో శుభ కార్యాలకు వినియోగించుకునేలా కృషి చేయాలని కోరారు. పర్యటనలో టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ (బాబు), బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, పిల్లాడి సత్యవతి, బొందల రామలక్ష్మి, కమిషనరు ఎ.శ్రీవిద్య, అధికారులు పాల్గొన్నారు.


కాపు కల్యాణ మండపం ఆధునికీకరణ పనులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

ఇందిర, వల్లభాయ్ పటేల్‌లకు నివాళి

కాకినాడ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి, తొలి హోం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిలను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, నగర శాఖ అధ్యక్షుడు చెక్కా నూకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకుడు తాళ్లూరి రాజు, పీసీసీ సభ్యుడు పోలిశెట్టి శ్రీనివాసరావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి దాట్ల గాంధీరాజు, ఉపాధ్యక్షులు పబ్బినీడి కృష్ణ, దవులూరి ధనకోటి, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ మొయ్యేటి సూర్యప్రకాష్, మండల శాఖ అధ్యక్షుడు పాండ్రంగి రమణమూర్తి, గరగ వీరేంద్ర, నవుడు గోవిందు, వనుం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరా గాంధీ, వల్లభాయ్ పటేల్ చిత్రపటాల వద్ద నివాళులరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

'కౌలు రైతులకు తుఫాన్ నష్టపరిహారం చెల్లించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, అన్నదాత సుఖీభవ సొమ్ములను కౌలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ కౌలు రైతులకు ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ పంటల నష్టాల గణనను రెండు రోజుల్లోనే హడావుడిగా పూర్తి చేస్తున్నారన్నారు. కేరళ, తెలంగాణ రాష్ట్రాల తరహాలో క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. సంఘం నాయకులు చల్ల సంతోష్ కుమార్, యడ్ల కృష్ణార్జున, పిల్లి నాని, దడాల అబ్బులు, వాసంశెట్టి సత్తిబాబు, పంపన నాగేశ్వరరావు, విఘ్నేశ్వరరావు, గణేశ్వరరావు, సూర్యనారాయణ, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ రూరల్ మండలంలో మత్స్యకారులకు బియ్యం, నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

బాధితురాలికి బ్రెడ్ ప్యాకెట్లు అందజేస్తున్న బీజేపీ భవన నిర్మాణ కమిటీ రాష్ట్ర సభ్యుడు గట్టి సత్యనారాయణ

తుఫాన్ బాధితులకు సహాయం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. శుక్రవారం సాయంత్రం కాకినాడ రూరల్ నేమాం, సూర్యారావుపేట మత్స్యకార గ్రామాల్లో తుఫాన్ బాధితులకు 50 కిలోల బియ్యం, కందిపప్పు, నూనె, బంగాళా దుంపలు, ఉల్లిపాయలు, పంచదార కిలో చొప్పున ఆయన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కూటమి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్, శెట్టిబలిజ కార్పొరేషన్ల డైరెక్టర్లు శిరంగు శ్రీనివాసరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పెంకే శ్రీనివాసబాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పుల్ల శ్రీరాములు, బీజేపీ నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, ఎంపీడీవో పి.సతీష్, తహసీల్దారు కుమారి పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో బీజేపీ రాష్ట్ర భవన నిర్మాణ కమిటీ సభ్యుడు గట్టి సత్యనారాయణ ఆ పార్టీ శ్రేణులతో కలిసి పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని కొమరగిరి లే-అవుట్, కాకినాడ సిటీలోని రేచర్లపేట, దుమ్ములపేటల్లో పర్యటించారు. పునరావాస కేంద్రాల్లో బాధితులతో మాట్లాడారు. చిన్నారులకు బ్రెడ్ ప్యాకెట్లు, పెద్దలకు ఆహార ప్యాకెట్లు అందించారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ ఆదేశాలతో ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు సమన్వయంతో తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని చెప్పారు.



పెద్దాపురం మండలం కాండ్రకోటలో ఏలేరు వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప,

పిఠాపురం మండలంలో ఏలేరు కాలువకు పడిన గండ్లను చూస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

'రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం'

పెద్దాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కాండ్రకోటలో పర్యటించారు. ఏలేరు వరద ఉధృతిని పరిశీలించి ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడారు. దబ్బ కాలువను పరిశీలించారు. పంటలు నీట మునగడంపై ప్రస్తుత పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టపోయిన రైతులను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గుర్తించి వారికి న్యాయం చేస్తామని తెలిపారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మొయిళ్ల కృష్ణమూర్తి, ఎలిశెట్టి నాని, ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): ఏలేరు వరదల కారణంగా జరుగుతున్న నష్ట పాపం వైసీపీదేనని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురం-గొల్లప్రోలు మధ్య పిడిందొడ్డి, గొర్రిఖండి, టోల్‌గేట్ ప్రాంతాల్లో పడిన గండ్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. రైతులను కలిసి ఇసుక బస్తాలు నింపి గట్లపై వేయించారు. గండ్లను పూడ్చేందుకు, నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వర్మ వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

16న శెట్టిబలిజ కార్తీక వనసమారాధన

కాకినాడ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో నవంబరు 16న అమలాపురంలో జరిగే ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ కార్తీక సమారాధన, ఆత్మీయ సమ్మేళనం ఆహ్వాన పత్రికలను అమలాపురానికి చెందిన బీసీ నాయకుడు దొంగ శ్రీను శుక్రవారం కాకినాడలో బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యనమదల రవికి, నాయకులకు అందజేశారు. కొండయ్యపాలెంలోని బీసీ సంఘ కార్యాలయలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి పెంకే రాజు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అనసూరి సతీష్, మాజీ ఎంపీటీసీ కొండా వినాయక్, పెంకే శివ, వాసంశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

కరప, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కరపలోని మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం హైస్కూలు పూర్వ విద్యార్థులు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 56 మంది బాలికలకు నేటికీ పాఠ్య పుస్తకాలు రాలేదని తెలిసి 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు స్పందించి వారికి అవసరమైనవి అందజేశారు. పూర్వ విద్యార్థులు పెంకే నూకరాజు, నానాజీ, తుట్టా సురేష్, నక్కా భీమశంకర్, పోలిశెట్టి సునీల్, సలాది విజయ్‌బాబు, భగవాన్, తుమ్మలపల్లి సత్యనారాయణ, కళా తులసి, పద్మిని ఔదార్యాన్ని మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కరప, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వేళంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 విభాగాల్లో షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు జరిగాయి. బాలురు జూనియర్స్ విభాగంలో వాకాడ గ్రీన్‌ఫీల్డ్ స్కూలు విద్యార్థులు ప్రథమ, కరప హైస్కూలు విద్యార్థులు ద్వితీయ స్థానాల్లో నిలిచారు. సీనియర్స్ విభాగంలో వేళంగి ప్రథమ, కరప ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బాలికలు జూనియర్స్ విభాగంలో వేళంగి విన్నర్, కరప రన్నర్‌గాను, సీనియర్స్ విభాగంలో కరప విన్నర్స్‌గాను, వేళంగి రన్నర్‌గాను నిలిచాయి. విజేతలను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, వేణు, సత్యనారాయణ, కృష్ణ, భానుప్రకాష్, ఉపాధ్యాయులు డి.సుబ్బారావు, పి.లక్ష్మణరావు అభినందించారు.

కార్పొరేషన్ (కాకినాడ), (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండల స్థాయి ఎస్‌జీఎఫ్-14, 17 విభాగాల్లో బ్యాడ్మింటన్, చెస్, యోగాలకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించిన ఎంపికలకు 150 మంది క్రీడాకారులు హాజర య్యారు. 48 మందిని డివిజన్ స్థాయికి ఎంపిక చేశామని కాకినాడ రూరల్ ఎంఈవోలు టీవీఎస్ రంగారావు, కె.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. బాలుర విభాగానికి వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.హరిబాబు, టీవీవీ ప్రసాద్, ఎన్.శ్రీనివాస్, చార్లెస్, ఫిదా హుస్సేన్, త్రిమూర్తులు, బాలికల విభాగానికి జయలక్ష్మి, రాజు, మంగ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.


విజేతలతో వేళంగి హైస్కూలు ఉపాధ్యాయులు

గోదావరి కాలువలో వ్యర్థ కాలుష్య జలాలను నిరోధించాలి

గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే చినరాజప్పకు రైతుల ఫిర్యాదు

సామర్లకోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట గోదావరి కాలువలో వేట్ల పాలెం ఎగువ ప్రాంతానికి చెందిన ఒక పరిశ్రమ వ్యర్థ కాలుష్య జలాలను గోదావరి కాలువలోకి విడుస్తోంది. దీంతో గోదావరి జలాలు కాలుష్యంగా మారి పశువులకు తాగడానికి వీల్లేకుండా పోయిందన్నారు. పొలాలకు మళ్లిద్దామంటే కొత్త తెగుళ్లు వ్యాపించి పంటలు నష్టపోతున్నామని సామర్లకోట రైతు సంఘ ప్రతినిధులు శుక్రవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఎమ్మెల్యే రాజప్పకు ఫిర్యాదు అందజేశారు. రైతు సంఘం అధ్యక్షుడు కంటే జగదీష్‌మోహన్(బాబు), కార్యదర్శి యార్లగడ్డ బాపినీడు, గోలి కోటేశ్వరరావు, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, గుమ్మళ్ళ రామకృష్ణ, పైణ్ణి శ్రీనివాసరావు, వల్లూరి శ్రీధర్ తదితరులు ఎమ్మెల్యే రాజప్పను కలిసి గోదావరి జలాల కాలుష్యం సమస్యను వివరించారు. అ అంశాన్ని శాశ్వతంగా పరిష్కరించేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని రైతులకు హామీ ఇచ్చారు.

'ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలి'

కాకినాడ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ డీఈవో పి.రమేష్‌కు, కలెక్టర్ కార్యాలయ ఏవో రామ్మోహన్‌రావుకు ఫ్యాప్టో జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఫ్యాప్టో అధ్యక్షుడు కె.కాశీవిశ్వనాథ్, సాధారణ కార్యదర్శి సీహెచ్ సూరిబాబు, ఆర్థిక కార్యదర్శి బి.శరత్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, రాజబాబు, రామకృష్ణ, మహేష్, మహమ్మద్ క్వాజా శిష్టి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి బంగారు కిరీటం అలంకరణ



కాకినాడ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకట్‌నగర్‌లో దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని వేంకటేశ్వరస్వామివారికి భక్తుల సహకారంతో నూతనంగా తయారు చేయించిన బంగారు కిరీటాన్ని శుక్రవారం అలంకరించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. దేవదాయ శాఖ అధికారి రమేష్, ఆలయ ధర్మకర్త, చైర్మన్ జ్యోతుల వెంకటప్రసాద్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి'

పెద్దాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని డీఎస్పీ శ్రీహరిరాజు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని లెక్చరర్స్ కాలనీలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ పోలీసులు చేసే సేవా కార్యక్రమాలకు ప్రజలు, యువత సహకరించినప్పుడు వారితో ఉత్సాహం, విశ్వాసం రెట్టింపు అవుతుందన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీఐలు విజయ్‌శంకర్, కృష్ణభగవాన్, ఎస్ఐ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

'కాకినాడను క్లీన్-గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు'

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడను క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మలచడమే లక్ష్యంగా విస్తృత చర్యలు ప్రారంభించామని కార్పొరేషన్ కమిషనరు కేటీ సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన సోషల్ మీడియా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కాకినాడను చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో సోషల్ మీడియా ప్రతినిధులు భాగస్వాములై పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన పెంచేలా సహకరించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ కమిషనరు కె.శ్రీనివాసరావు, ఎస్ఈ పి.వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, డీసీపీ కృష్ణారావు పాల్గొన్నారు.

డీఎస్డీవోగా సతీష్‌కుమార్

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రాధికార సంస్థలో వెయిట్‌లిఫ్టింగ్ కోచ్‌గా పనిచేస్తున్న వర్రి సతీష్‌కుమార్ ఉద్యోగోన్నతిపై కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో)గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలవగా అభినందించారు.

మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన

పెద్దాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

దాణా ఉచిత పంపిణీ

కొత్తపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన ఉప్పాడ, అమీనబాద్ గ్రామాల్లో దాణా ఉచిత పంపిణీని ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ప్రారంభించారు. రైతులకు కూటమి నాయకులు దాణా పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీమన్నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి ఇందిర

ప్రత్తిపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశంలోని బడుగు, బల హీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన మహనీయురాలు ఇందిరాగాంధీ అని డీసీసీ ఉపాధ్యక్షుడు ధర్నాల కోట శ్రీను చెప్పారు. ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కళామందిర్ సెంట ర్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దాసరి సత్తిబాబు, కందిమళ్ళ శామ్యూల్,కాకర నాగేశ్వరరావు, పెద పాటి నాగేశ్వరరావు, ముప్పల అప్పన్న పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

● ఎమ్మెల్యే శిరీషదేవి


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి, ఇతరులు

దేవీపట్నం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి భరోసా కల్పించారు. మండలంలో ఇటీవల తుఫానుతో నష్టపోయిన బాధితులను టీడీపీ మండలాధ్యక్షుడు గోళ్ల చంటిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఆమె పరిశీలించారు. పెద్దభీంపల్లిలో మినుము పంట వేసి నష్టపోయిన ప్రగడ దిగేశ్వరరావు, గేదెల సుబ్బారావు పంటపొలాల్లోకి వెళ్లి పరిస్థితిని చూశారు. సొసైటీ అధ్యక్షుడు మాగాపు బాబూరావు, ఏఎంసీ డైరెక్టర్ జొన్నల రాంబాబు, జొన్నల శ్రీనివాస్, దాకారపు సత్యనారాయణ, కె.పోచమ్మ, కీర్తి గంగరాజు, మధుసూదనరావు, తైలం గంగాధర్, సారపు రాంబాబు, ముచ్చు త్రిమూరలు, అడబాల వీరభద్రం, కారం తమ్మన్నదొర, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో ఎస్.సాల్మాన్‌రాజు, ఏవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంట నష్టం నివేదిక సమర్పించండి

● ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ ఆదేశం

దేవీపట్నం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న ఇళ్లను, పంటలను సర్వే చేసి నివేదిక సమర్పించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఫజుల్లాబాద్, ఇందుకూరుపేటలో దెబ్బతిన్న ఇళ్లను, పంటలను పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్లు పి.బాలాజీ, కె.సత్యనారాయణ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహనరావు, ఎంపీడీవో సాల్మాన్‌రాజు, ఏవో వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలి : సీఐ

చింతూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని చింతూరు సీఐ గోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ పీ. దివాకర్, ఎస్ఐ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎటపాక: సమాజంలో అందరూ ఐక్యతగా మెలగాలని సీఐ మిర్తివాడ కన్నపరాజు పేర్కొన్నారు. శుక్రవారం దివంగత సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఎటపాకలో పోలీసులు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ నుంచి ఎటపాక ప్రధాన సెంటర్ వరకు జాతీయ జెండాలతో ఉత్సాహంగా రన్నింగ్ నిర్వహించారు. అనంతరం సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. పోలీసు అమరవీరులకు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ గుంటుపల్లి అప్పలరాజు, ఏపీఎస్పీ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

మోతుగూడెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఎస్ఐ ఎస్కే సాదిక్ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ డీఎస్పీ లలిత్ కుమార్, ఫారెస్ట్ సిబ్బంది వెంకట్, రాములమ్మ లోయర్ సీలేరు ఏపీ జెన్కో ఇంచార్జ్ అసిస్టెంట్ సెక్యూరిటీ గ్రామంలోని యువత ఘనంగా నిర్వహించారు.

రంపచోడవరం: సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పీవో స్మరణ్ రాజ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, మేనేజర్ రాజు, పీఎంయూ అధికారి మోహన్, శ్రీనివాసరావు, చక్రధర్‌రావు, రాజన్, వెంకటేశ్వరరావు, వేవతి, అర్చ రమణి, డి.ప్రభాకర్‌రావు, రాజేశ్వరి, భీమిరెడ్డి, నాగభూషణం, నాగేంద్ర, కె.రాంబాబు, ప్రసాద్, ఎస్‌టీవో సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సీతపల్లి సెంటర్ నుంచి భీముడుపాకల వరకు యువతో కలిసి జాతీయ సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, ఎస్ఐ వినోద్, సిబ్బంది మారథాన్ రన్ చేపట్టారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

'ఇందిరా గాంధీ సేవలు మరువరానివి'

చింతూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దివంగత ప్రధాని ఇందిరా గాంధీ పేద, బడుగు, బలహీన వర్గాలకు చేసిన సేవలు మరువరానివని మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అహ్మద్ ఆలీ పేర్కొన్నారు. శుక్రవారం చింతూరు సెంటరులో ఇందిరా గాంధి వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చింతూరు మండల కార్యదర్శి అహ్మద్ ఆలీ ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ చింతూరు మండలశాఖ అధ్యక్షుడు అక్బర్, ఎండీ జోహార్, నరేష్, కన్నయ్య, వెంకటేష్, రవ్వ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

వీఆర్‌పురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) పోలవరం నిర్వాసితుల సమస్యలు త్వరగా పరిష్కారం కావాలంటే రంపచోడవరం కేంద్రంగా నూతన జిల్లాను ఏర్పాటుచేయాలని సీపీఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం చొక్కనపల్లిలో జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన పాడేరుకు వెళ్లి ఈ ప్రాంత ప్రజలు సమస్యలు చెప్పుకోవాలంటే అందని ద్రాక్షలా ఉందని, ఇక్కడ 11 మండలాలు, ఏలూరులోని నాలుగు మండలాలు, నాన్ షెడ్యూల్ ప్రాంతంలోని గిరిజన గ్రామాలను కలుపుతూ రంపచోడవరం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేయడం వల్ల అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు తోడం రాజు అనిల్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేసి నివేదికలు అందజేయాలి : ఐటీడీఏ పీవో

రంపచోడవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ఇళ్లు, పంటలను సర్వే చేసి నివేదికలు సమర్పించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన గోపవరం, ఫజుల్లాబాద్, ఇందుకూరుపేట గ్రామాల్లో పర్యటించారు. ఆయన వెంట తహశీల్దార్లు పి.బాలాజీ, కె.సత్యనారాయణ, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో సాల్మన్‌రాజ్, మండల వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రభుత్వం అప్రమత్తతతో తగ్గిన తుఫాన్ నష్టం

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ


కిర్లంపూడి: ఏలేరు వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

కిర్లంపూడి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ యంత్రాంగం మొంథా తుఫాన్‌పై ముందస్తు ప్రణాళికతో ఉండడం వల్లే నష్ట తీవ్రత తగ్గిందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణితో కలిసి కృష్ణవరం, ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం, రాజుపాలెం, ముక్కొల్లు గ్రామాల్లో పర్యటించి మునిగిపోయిన పంట పొలాలు, వాలు కాలువ ప్రాంతాలను పరిశీలించారు. నెహ్రూ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తనను అనేకసార్లు అప్రమత్తం చేశారని, ముఖ్యంగా ఏలేరు ఆయకట్టు ఎలా ఉందని అడిగారన్నారు. గతేడాది ఇక్కడ భారీ వరదల కారణంగా ఎక్కువ నష్టం జరగడంతో సీఎం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. తాను, ఇక్కడ అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ముందస్తు ప్రణాళికలతో నష్ట నివారణ తగ్గించామన్నారు. సీఎం చంద్రబాబు ఏలేరు ఆధునీకరణకు కృష్ణవరం నుంచి గోనేడ వరకు రిటర్నింగ్ వాలు కట్టించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని నెహ్రూ తెలిపారు. కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, తోట రవి, వీరంరెడ్డి కాశీబాబు, తోట గాంధీ, తూము కుమార్, చదరం చంటిబాబు, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్, జ్యోతుల రాంబాబు, సుబ్బారావు ఉన్నారు.

తుఫాన్‌ను సమర్ధవంతంగా ఎదుర్కొన్నాం

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి): మొంథాతుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. నియోజకవర్గంలోని అధికారులు ఎంతో సమన్వయంతో పని చేశారు.. ఇదే స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలంటూ ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయంవద్ద శుక్రవారం నియోజకవర్గ అధికారులతో మొంథా తుఫాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబం ప్రతిరైతు వరకు ప్రభుత్వ సహాయం చేరేలా చూడాలని అధికారులు మరింత సమగ్రంగా నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. కష్టకాలంలో అద్భుతంగా పని చేసిన నియోజకవర్గ అధికారులు, ఉద్యోగుల సేవలను ఎమ్మెల్యే ప్రసంశించారు. తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, ఏవో అమృత, విద్యుత్‌శాఖ ఏఈ వెంకటరమణ తదితర అధికారులు, సిబ్బందిని ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీబీఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ళ జగదీష్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని, అంబటి రాంబాబు, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో మత్స్యకారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. తుఫాన్ కారణంగా ఏలేరు జలాశయంలో చేపలవేట నిషేధించడంతో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సుమారు 410 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ 50 కిలోల బియ్యం, నిత్యావసరాలు ఎమ్మెల్యే అందజేశారు. కౌన్సిలర్లు అల మండ చలమయ్య, మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, యండగుండి నాగబాబు, కోనాల వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, సుబ్బారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో 80 మంది చేరిక

రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. శుక్రవారం మండలంలోని లింగంపర్తి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీలు గాడు రాఘవ, కాళ్ళ త్రిమూర్తులు, బోను రాంబాబు నేతృత్వంలో సుమారు 80 మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

గండి పూడ్చివేత

కిర్లంపూడి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏలేరు నీరు దిగువ కాలువలకు విడుదల చేయడంతో కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామంలో ఆలుకాలువ వద్ద గండి పడి నీరు పొలాల్లోకి వచ్చేసింది. దీంతో పొలాలన్నీ ముంపునకు గురయ్యాయి. విషయం తెలుసుకున్న ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు, గంధం ఈశ్వరావు, మాజీ ఎంపీటీసీ గొడే దొరబాబు, సర్పంచ్ జ్యోతుల రాంబాబు ఈ విషయాన్ని కాకినాడ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ దృష్టికి తీసుకెళ్లారు. హుటాహుటిన నవీన్ సంఘటన ప్రదేశానికి చేరుకుని అధికారులు, నాయకులతో కలిసి గండికొట్టిన కాలువకు ఇసుక బస్తాలు వేసి పూడ్చారు. అనంతరం నీటమునిగిన వరి పంటలు పరిశీలించారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, సర్పంచ్ జ్యోతులరాంబాబు, గంధం ఈశ్వరరావు, గొడే దొరబాబు, ప్రసాద్, దొరబాబు, తహసీల్దార్ చిరంజీవి, ఏఈ శ్రీనివాస్, సూరిబాబు ఉన్నారు.

ప్రతి సమస్యను పరిష్కరించడమే లక్ష్యం

● ప్రజా దర్బారులో ఎమ్మెల్యేకు 283 వినతులు


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం ప్రభుత్వ విప్,తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఆధ్వర్యంలోని నిర్వహించిన ప్రజా దర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. 11నుంచి 15 వ వార్డు వరకు సంబంధించిన ప్రజలు వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి సమస్యను విన్న ఎమ్మెల్యే వాటిలో కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. మరికొన్నింటిని అధికారుల పరిశీలన నిమిత్తం పంపించారు. ప్రజా దర్బార్‌కు మొత్తం 283 వినతులు రాగా 180 వినతులు అక్కడికక్కడే పరిష్కరించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడమే తమ లక్ష్యమని తెలిపారు. తహశీల్దార్ ప్రసాద్, కూటమి నాయకులు, యినిగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, మళ్ళ గణేష్, జక్కాన రామునాయుడు, ఆవుగంటి వెంకటరమణ, తమరాన సత్యనారాయణ, రామకృష్ణ ఉన్నారు.

తుఫాన్ బాధితులకు సరుకుల పంపిణీ

తుఫాన్ బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే దివ్య తెలిపారు. తుని మండలం జిల్లేడుపాడులో 142 మంది తుఫాన్ బాధితులకు ఆమె నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. యనమల లక్ష్మణరావు, కాలిబోయిన గంగారావు, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, కె.తాతబాబు ఉన్నారు.

'ఆదిత్య'లో జాతీయ ఐక్యతా దినోత్సవం

గండేపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్వహించింది. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరై దేశ ఐక్యత, సమగ్రత ప్రాధాన్యతపై వివరించారు. సమైక్యత ర్యాలీ చేపట్టారు.

కళాశాల అభివృద్ధి మండలి ఏర్పాటు

జగ్గంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో కళాశాల ప్రణాళిక, అభివృద్ధి మండలి ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా డీ.సత్యనారాయణ మూర్తి, మెంబర్ సెక్రటరీగా పి.సురేష్, సాహితి వర్మ, ఎం.రాజేష్, వై.వీర నాగేశ్వరరావు, కె.పార్వతి, జి.వీరబాబును సభ్యులుగా నియమించారు. కళాశాలలో జాతీయ ఐక్యత దినోత్సవం నిర్వహించారు.

సనాతన ధర్మం ప్రాచుర్యానికి భజన బృందాలు దోహదం


సమావేశంలో ప్రసంగిస్తున్న స్వామిజీ

ప్రత్తిపాడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం ప్రాచుర్యానికి భజన బృందాలు ఎంతో దోహదపడతాయని అన్నమయ్య కళాక్షేత్రం రాష్ట్ర అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు చెప్పారు. మండలంలోని ధర్మవరం శివాలయంలో వారం పాటు నిర్వహించే చతుర్ధి సప్తాహ మహోత్సవాలను శుక్రవారం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాజా ఐవీఆర్ఆర్ కృష్ణ ప్రసాద్ బహదూర్, సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయిలు ప్రారంభించారు. సానా మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే సనాతన ధర్మం పెంపొందించవచ్చన్నారు. ఆలయాలను, హిందూ సాంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత హిందువులు అందరిపైన ఉందన్నారు. జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దా సం శేషారావు, కాకినాడ లలిత పీఠ ఆశ్రమాధిపతి కర్రి రాజేశ్వర స్వామిజీ ప్రసంగించారు. సప్తాహ కమిటీ సభ్యులు సిద్దా పెద్దిరాజు, సానా తాతీలు, ఆవాల శ్రీను, కడారి శ్రీనివాసరావు, భైరారాజు, రెడ్డిపల్లి శ్రీను, బొల్లు వెంకట్రావు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

గండేపల్లి, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంక్ రక్తదాన నిర్వహించారు. సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు రక్తదానం చేసినట్టు డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎస్ఐ శివనాగబాబు హాజరై విద్యార్థులను అభినందించారు.

నేడు ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ

ప్రత్తిపాడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): చినశంకర్లపూడిలో శనివారం అభయ ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేపట్టారు. గ్రామంలోని సగర్ల రామాలయం వద్ద సగర పెద్దలు, కమిటీ, గ్రామపెద్దల సహాయ సహకారాలతో ఆంజనేయ స్వామి మండపాన్ని ఏర్పాటు చేశారు. హోమాలతో పాటు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కొండబాబుకు సన్మానం

జగ్గంపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక గోకవరం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీ చెన్నారావు ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు)ను సన్మానించి నిర్వహించి జ్ఞాపిక అందించారు. ప్రిన్సిపల్ మాట్లా డుతూ కళాశాలకు నాలుగేళ్లపా టు సీపీడీసీకమిటీ సభ్యుడిగా సేవలందించిన కొండబాబును సన్మానించారు. దేవరపల్లి మూర్తి, పాలకుర్తి సురేష్, మానేపల్లి రాజేష్, కాలేజ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

గండేపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ఇండియా ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేరెనెస్ వీక్-2025సందర్భంగా నిర్వహించిన విజిలెన్స్ మనందరి సంయుక్త బాధ్యత అనే అంశంపై రామచంద్రాపురం ప్రేమానందం బుర్రకథ బృందగానంచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది.జడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బహుమతులు ప్రదానం చేశారు. పవర్ గ్రిడ్ అధికారులు కోటేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత వల్లభాయ్ పటేల్

ఏలేశ్వరం, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యతకు స్ఫూర్తి సర్ధార్ వల్లభాయ్ పటేల్ అని కౌన్సిలర్ అలమండ చలమయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలో కోనేటి పాఠశాల పటేల్ జయంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి టీడీపీ, బీజేపీ నాయకులు నివాళులర్పించారు.గట్టిం వెంకటరమణ, బూర్లు సత్తిబాబు, అలమండ దుర్గా వెంకట ప్రసాద్, వైభోగుల సుబ్బారావు, రెడ్డి లోవరాజు, గూడవిల్లి అర్జునరావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కార్యాలయంలో సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా పటేల్ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజు, నాయకులు తేజోమూర్తుల ఉషారాణి, కందా వీరాస్వామి, ఇంటి నాగేశ్వరరావు, చింతాకుల రామకృష్ణ, నక్కా శ్రీనివాసరావు, ఎం.కృపానందం, కొల్లి సత్తిబాబు, ఇంటి రాంబాబు పాల్గొన్నారు.

కండక్టర్‌కు సత్కారం

ఏలేశ్వరం,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ గ్యారేజ్‌లో 37ఏళ్లుగా ఆర్టీసీ కండక్టర్‌గా ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ చేస్తున్న రామిశెట్టి నాగభుజంగరావు దంపతులకు పూలమాలలువేసి, శాలువా కప్పి, మెమెంటో అందజేసి సత్కరించారు. డిపో కార్యదర్శి యూ.కుమార్, మేనేజర్ జి.నారాయణ

రైతులకు అవగాహన

జగ్గంపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి):కాట్రావులపల్లిలో జగ్గంపే ట ఉద్యాన అధికారి శ్రీవల్లి, డాక్టర్ పి.సునీత, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జానకి, పెద్దాపురం సైంటిస్ట్ కేకేవీకే పందిరిమామిడి, డాక్టర్ పుష్ప, డాక్టర్ ఆంజనేయులు, గ్రామవ్యవసాయ సహాయకులు మిర్చి, ఇతర పంటల ను సందర్శించి వారికి మొంథా తుఫాన్ కారణంగా ఏర్పడిన నష్టం నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రేషన్ ఇప్పించండి!



నలుగురే ఉన్నట్లు చూపిస్తున్న దృశ్యం

జగ్గంపేట రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.కొత్తూరు గ్రామానికి చెందిన కందికట్ల నాగు కురాప్ 41800800466 నెంబరుతో ప్రభుత్వం రేషన్ కార్డ్ మంజూరు చేసింది. ఇటీవల స్మార్ట్ కార్డు పేరుతో 2804064857 నంబర్ గల నూతన కార్డును అందించారు. కుటుంబంలో ఐదుగురు సభ్యులు ఉన్నప్పటికీ నలుగురికి మాత్రమే రేషన్ అందుతుంది. బ్రతికుండగానే రేషన్ కార్డులో యజ మాని చనిపోయినట్టు అధికారులు ఆన్‌లైన్ నమోదుచేయడంతో లబ్ధిదారుడు లబోదిబో అంటున్నాడు. ఉన్నతాధికారులు స్పందించి రేషన్ ఇప్పించి, ప్రభుత్వ పథకాలను అందేలా చూడాలని కోరుతున్నాడు.

సమస్యలపై ఐటీడీఏ పీవోకు వినతి


పీవోను సత్కరిస్తున్న ముర్వా శ్రీనివాస్

ఎటపాక, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యలపై ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్‌కు టీడీపీ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి ముర్వా శ్రీనివాస్, ఎటపాక సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు వినతి పత్రం అందజేశారు. ఈమేరకు శుక్రవారం చింతూరు ఐటీడీఏలో కలిశారు. గ్రామాల్లో రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్య, అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీల పూర్తి, ఏపీ పరిధిలోని ఎటపాక నుంచి కన్నాయిగూడెం వరకు అంతరాష్ట్ర రహదారిని పునర్నిర్మించాలని కోరారు. స్పందించిన పీవో తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు ముర్వా తెలిపారు. అనంతరం పీవోను సత్కరించారు. మాజీ జడ్పీటీసీ గొడేటి రవికుమార్, పీ. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.